# శ్రీ రమణ జ్యోతి

జూలై 2017

ఈ సంచికలో ...

# Sri Ramana Jyothi

July 2017

IN THIS ISSUE ...


| | | | |
|---|---|---|---|
| 1. | జన్మాష్టమి | తాడిమేటి సత్యనారాయణ | 3 |
| 2. | భగవాన్ ఉపదేశసారము | పింగళి సూర్యసుందరం | 11 |
| 3. | శ్రీ భగవాన్ పాద సన్నిధిలో | జి. శ్రీహరిరావు | 15 |
| 4. | కర్మసిద్ధాంతం | వి. రామదాస్ మూర్తి | 18 |
| 5. | మరణానుభవము | వి. శ్యామ సుందరి | 23 |
| 6. | Real Freedom | Dr. K. Subrahmanian | 26 |
| 7. | "Do You Still Find Two?" | | 29 |
| 8. | The Previous Avatar of Lord Subrahmanya | Kanchi Mahaswamy | 30 |
| 9. | Experience of Deep Sleep A Pointer to the Ultimate State | V. Krithivasan | 33 |
| 10. | Kavyakanta and Gajaanan | | 37 |
| 11. | Is This Alone False ? | Sadhu Om | 38 |
| 12. | How I came to Bhagavan | Phanimala Malladi | 41 |
| 13. | Vande Prabhum Sadgurum | | 43 |


శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు : కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్
(వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీరమణకేంద్రం)


**Editorial Board:** Telugu: **Dr. V. Ramadas Murthy, Malladi Phanimala, Katravulapalli Subbalakshmi**
English: **V. Krithivasan, N.S. Ramamohan, Sneha Choudhury**

# జన్మాష్టమి

(మూలం డా. కె.ఎస్. గారి 40వ ప్రవచనం)

అనువాదం: తాడిమేటి సత్యనారాయణ

**వటస్య పత్రశ్య పుటేశ యానమ్**

**బాలం ముకుందం మనసా స్మరామి**

ఈ రోజు జన్మాష్టమి. అంటే అష్టమి తిథినాడు జననమన్నమాట. జన్మాష్టమి అంటే ఇంకే వివరాలు అవసరం లేదు. ఆనాడు శ్రీకృష్ణుని జన్మదినం. శ్రీకృష్ణులు పూర్ణావతారం. శ్రీరాములవారి జన్మదినం శ్రీరామ నవమి అంటారు. అంతేగాని జన్మనవమి అనము. శ్రీరాముల వారి విషయంలో వారి నామాన్ని చేర్చి శ్రీరామనవమి అంటున్నాము. కాని శ్రీకృష్ణుని పేరు చేర్చకుండా జన్మాష్టమి అని వాడుకలోనున్న విషయం. అవతారాలన్నీ ముఖ్యమైనవే, కాని శ్రీకృష్ణావతారం ఎంతో అపురూపము, అసాధారణమయినది. ధైర్యము, కృతజ్ఞత, ధర్మం, వీరం, అని ఎన్నో సుగుణాలతో శ్రీరాముని వర్ణిస్తాము. ఇవన్నీ సత్పురుషుల లక్షణాలు. కాని శ్రీకృష్ణుని గొప్పతనం ఏమంటే, శ్రీమద్భాగవతం శ్రీకృష్ణుని గురించినవన్నీ మధురమయినవని వర్ణిస్తుంది. బాలకృష్ణుడని, చిన్ని కృష్ణుడని బాల్యంలో వున్న శ్రీకృష్ణుని వర్ణిస్తారు. ఒక యువకునిగా, ఒక ప్రేమికునిగా, అటుపై భర్తగా, మిత్రుడిగా, ఒక సైనికుడిగా, ఒక మహారాజుగా, ఒక వేదాంతిగానూ పేర్కొంటుంది భాగవతం. అంటే సకల జీవులను ప్రేమించే స్వభావం కలవాడని భావం. అంతేగాక భాగవతం ఆయన ఒక స్థితప్రజ్ఞుడు, పరమాత్మ స్వరూపుడని, శ్రీకృష్ణుని ప్రతి అంశం ఎంతో సుందరము, మధురమని చెప్తుంది. శ్రీకృష్ణుడు ఎందు సుందరుడు కాదు అని శుకుడు అంటారు.

అధరం మధురం, వదనం మధురం
నయనం మధురం, హసితం మధురం
హృదయం మధురం, గమనం మధురం
మధురాధిపతేరఖిలం మధురం.
వచనం మధురం, చరితం మధురం
వసనం మధురం, నవితం మధురం
చలితం మధురం, భ్రమితం మధురం
మధురాధిపతేరఖిలమ్ మధురం
గీతం మధురం, పీతం మధురం
భుక్తం మధురం, తిలకం మధురం
మధురాధిపతేరఖిలమ్ మధురం

(ఇది శ్రీవల్లభాచార్యుల వారు రచించిన మధురాష్టకం)

ఓ కృష్ణా! నీలో ప్రతి అంశం మధురమయినది. ఒక కృష్ణుని తప్ప ఏ అవతరాన్ని కూడా ఇంత మధురంగా చిత్రీకరించలేదు. కనుకనే ఆయన పూర్ణావతారుడు. కుచేలుడు, భీష్ముడు, అర్జునుడు, ద్రౌపది, ఉద్ధవుడు, వీరందరూ శ్రీకృష్ణుని అనుగ్రహానికి పాత్రులయినవారు. దానికి భక్తులపై గల దయయే కారణం.

అనన్యాశ్చిన్తయన్తోమాం యేజనా పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం

(భ.గీ. 9-22)

అని గీతోపదేశం. ఎవరు నన్నే స్మరిస్తారో, నన్నే శరణొందుతారో, వారి యోగక్షేమాలను నేనే చూసుకొంటానని అభయమిచ్చారు శ్రీకృష్ణులు.

సాధువులు, యోగులు సదా భగవంతుని స్మరిస్తూంటారు.

అనుక్షణం ఆయన గురించే మాట్లాడుతూంటారు. కారణం, వారికి మరే వ్యాపకం లేదు. వారి క్షేమానికై మన వంతు సహాయములను అందించే బాధ్యత మనకున్నది. వారిని దర్శించేటప్పుడు, ఫలమో, మరొకటో వారికి అర్పిస్తాము. వారు ఇతరులను ఏదీ యాచించరు. కాబట్టి అట్టి వారికి మనము తప్పక సహాయమందిస్తాము. కనుక దీనిని తప్పక పాటించాలి. ఎవరైనా అడిగితే లేదంటాము. అడగకపోతే వారికి ఎంతో ఇస్తాము. ఇదే ఈ లోకం పోకడ. మనతో ఇట్టి కార్యాలను చేయిస్తున్నదెవరు? భగవంతుడే. మనము ఇచ్చినదానిని ఆ యోగి కొంత తీసుకొని, మిగతాది ఇతరులకు పంచుతారు. ఉన్న దానితో సంతృప్తి చెందుతారు వారు. కాని సగటు మనిషి తన తీరని కోర్కెలను ఇంకా ఇంకా తీర్చుకోవాలని తాపత్రయపడుతాడు. జీవితాన్ని అట్లాగే గడిపేస్తాడు. కోర్కెల కొరకే బ్రతుకుతాడు.

"త్యాగము అత్యంత ఆనందదాయకము" అని బుద్ధుడు అన్నారు. నిర్వాణం కూడా ఆనందమేనట. దేనితోనూ మనకు బంధం లేదు. దేనినీ ఆశించడం లేదు. వాటంతట ఏదైనా వస్తే తీసుకోవచ్చును. అట్లాగే మన వద్ద నుండి ఏదైనా పోతే మనం దుఃఖించనవసరం లేదు. భగవద్గీతలో ఒక శ్లోకముంది. అందు శ్రీకృష్ణభగవానులు ఇట్లు చెప్పారు. (భ.గీ. 2-56)

దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషువిగతస్పృహః
వీతరాగభయక్రోధః స్థిత ధర్మునిరుచ్యతే ॥

అంటే దుఃఖములందు కలతనొందని మనస్సుగల వాడును, సుఖములందు ఆసక్తి లేని వాడును, అనురాగము, భయము, కోపము తొలగినవాడునగు (ఆత్మ) మననశీలుడు స్థిత ప్రజ్ఞుడని చెప్పబడును. ఎట్టి పరిస్థితులలోను కలతచెందక వుండాలనే పై శ్లోకభావము.

ఏవీ నిత్యము కావు. సుఖదుఃఖాలు, మంచి చెడూ, అన్నీ ఒక చక్రం వంటివి. వస్తూంటాయి, పోతూంటాయి, మారుతూంటాయి. స్థితప్రజ్ఞుడయిన జ్ఞాని ఏది సంభవించినా కలత చెందడు. కోర్కెలు, భయక్రోధాదులు లేనివాడు అతడు. కాని మనం ప్రతిబంధకాలను తట్టుకోలేము. మనకు కావలసినది లభించలేదని ఆగ్రహంతో ఇతరులపై దాడిచేస్తాము.

క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్స్మృతి విభ్రమః
స్మృతి భ్రంశా ద్బుద్ధినాశో బుద్ధినాశాత్ప్రణశ్యతి

విషయచింతన ఎంతటి అనర్థాలకు దారితీస్తుందో పై శ్లోకం విశదీకరిస్తుంది. (భ.గీ. 2-63). క్రోధం, మోహం బుద్ధి వినాశానికి దారి తీసి చివరకు మనిషిని నిట్టనిలువునా కూల్చేస్తాయి. కనుక శ్రీకృష్ణ భగవాన్ బోధ ఒకటే. (భ.గీ. 2-47).

కర్మణ్యేవాధికారస్తే మాఫలేషు కదాచన
మాకర్మఫల హేతుర్భూర్మాతే సజ్గోస్త్వ కర్మణి

కర్మ చేస్తే ప్రతిఫలం లభించవచ్చు, లభించకపోవచ్చు. కష్టపడినా ఫలం దక్కకపోవచ్చు. ప్రతిఫలాన్నిచ్చేది ఆ ఈశ్వరుడే. అపజయాన్ని కూడా భగవత్ప్రసాదంగా స్వీకరించాలి. జయాపజయాలను ఒకే రీతిగా స్వీకరించు అని శ్రీకృష్ణులవారు అంటారు. తెలివైనవాడు అపజయం పాలవుతాడు. తెలివి తక్కువ వాడు జీవితంలో ఎన్నో విజయాలను సాధిస్తాడు. ఇది ఎలా సాధ్యమని మనం ఆలోచిస్తాము. దానిని వివరించలేము. సమాజంలో ఇవన్నీ సహజం. పరిష్కారం ఒకటే. శక్తి మేరకు కర్మ చేయాలి. ఫలితాలు ఏమైనా వాటిని స్వీకరించాలి అప్పుడే ఒకనికి శాంతి.

ఇట్లాగే మన జీవితాల్లో మన మంచితనమే మన ఆలోచనలలోను, మన కర్మలలోను ప్రతిబింబిస్తుంది. శ్రీరాముని, శ్రీకృష్ణుని,

శ్రీరమణులను సదా స్మరిస్తూంటే, మన ఆలోచనలు కూడా నిర్మలంగా నిష్కళంకంగా వుంటాయి. అట్టి ధోరణిలో కర్మలనాచరించాలి. ఫలితాలు ఎట్టివైనా స్వీకరించాలి. శ్రీకృష్ణ భగవాన్ మరొక మాటంటారు.

"యోగః కర్మస్తు కౌశలమ్" అని.

ఈ మాట అన్ని రంగాలకి వర్తిస్తుంది. యాజమాన్యం, కర్మాగారం, వ్యాపారం అన్నిటికీ వర్తిస్తుంది. భగవద్గీతలో ఎంతో చక్కగా వివరించారు శ్రీకృష్ణులు. మనం ఒక మంచి నాయకుడుగా వుండాలంటే ఒక మంచి సేవకునిగా వుండాలంటారు. మనం చెప్పేది, బోధించేది, వాటిని ఆచరించి చూపాలి. అహంకారం ఎంత తక్కువగా వుంటే, జయం కూడా అంత ఎక్కువగా వుంటుంది. జ్ఞానులకు అహంకారం లేదు. వారి మాటలను భక్తులు శ్రద్ధతో వింటారు. జీవితంలో ఉపయోగపడే ఎన్నో విషయాలు భగవద్గీత మనకు బోధిస్తోంది. ఏ పని చేసినా నేర్పుతో చేయాలి. అదే యోగం అంటారు. ఆఖరికి చిన్న చిన్న పనులయినా చక్కగా, శ్రద్ధగా, నేర్పుగా చేయాలంటారు. యోగ అంటే కార్య సఫలత. పనిలో ఒక శ్రేష్ఠత, ఉత్కృష్ఠత (Excellence). ఎవరయినా అతిథులు ఇంటికి వస్తున్నారంటే ఇల్లు చక్కదిద్దుకొని, శుభ్రముగా ఉంచుతాము. సకల మర్యాదలు ఎంతో గౌరవం, శ్రద్ధలతో చేస్తాము. అట్లాగే ప్రతి పనిలో మన శ్రద్ధ కనబడాలి.

భక్తులు శ్రీ వెంకటేశ్వరస్వామి వారికి వజ్ర కిరీటాన్నిస్తారు. అలాగే మరికొందరు వారి వారికి తోచింది ఇస్తున్నారు. నిజంగా వారు ఇస్తున్నారా, మనం ఈ లోకాన్నంతా ఇచ్చినా అది ఆయనదే కదా! వారిదే వారికి తిరిగి ఇస్తున్నాము. మనమిచ్చేది కేవలం ఒక చిఱు కానుక మాత్రమే. మన భక్తికి ప్రతీకగా అర్పిస్తున్నాము అంతే. ఈశ్వరునికి మనము ఏమీ ఇవ్వలేము. ధనరూపంలో ఇచ్చే కానుకలు వారు

స్వీకరిస్తున్నారా? లేదే. ఆ ధనాన్ని ఇతర కార్యములకై వెచ్చిస్తున్నారు. భగవంతునికి కిరీటం ఉన్నా లేకపోయినా ఆయనేమీ పట్టించుకోరు. అయితే భగవానునికి మనం ఏదైనా అర్పిస్తే మన మనస్సులు శుద్ధ మవుతాయి. కాని మనం బయట అందరికీ నేను ఇంత ఇచ్చాను అని చెప్పుకోలేము. కనుక అర్పించేది ఏదైనా రహస్యంగా పదిమందికి తెలియకుండా చేయాలి. ఇచ్చేది అయిష్టంగా, అసద్బుద్ధితో ఇవ్వకూడదు. శ్రద్ధతో అర్పించాలి. ఎవరో ఒక నిరుపేద యాచించి నపుడు ఒక రూపాయి నాణెమును విసిరివేయకూడదు. ఇచ్చేది ఒక రూపాయి అయినా దానిని శ్రద్ధతో ఇవ్వాలి. కుచేలుడు అటుకులు స్నేహితుడయిన శ్రీకృష్ణునికి సమర్పించుకున్నాడు. ఎంతో శ్రద్ధతో ఇచ్చాడు. ఇదే యోగః కర్మస్తు కౌశలమ్ అంటే. ఇది మనం గ్రహించి నేర్చుకోవాలి. మనం జ్ఞానులము కాము. అయినా వారికున్నటువంటి వైఖరిని ఇతరులపై చూపించాలి. ఈ లోకంలో ఎవ్వరూ పారంగతులు కారు.

విశ్వామిత్రుడు ఒక గొప్ప ఋషి. అట్టి ఋషి మోహవశులైన విషయం తెలిసిందే. ఉద్ధవుడు ఒక గొప్ప పండితుడు. కాని కృష్ణుని నుండి ఎన్నో నేర్చుకొన్నాడు. ఎంతో సమయాన్ని ఉద్ధవునికై వెచ్చించారు శ్రీకృష్ణులవారు, అదే చివరకు ఉద్ధవగీత అయింది. ఇది భాగవతంలోని ఒక భాగం. మనం మంచి నడతగలవారమంటే దానికి కారణం భగవంతుని అనుగ్రహమే. అంతేగాని మన తెలివితేటల వల్ల కాదు. మన మనస్సు సదా ఏదో ఒకదాని వల్ల కల్లోల కడలిలా వుంటుంది. అట్టి స్థితిని భగవత్కృప వలనే తట్టుకోగలము. ఆ మోహపు వలలో చిక్కుకోము. భగవద్గీత ఒక గొప్ప గ్రంథము.

సర్వోపనిషదోగావో దోగ్ధా గోపాలనందనః
పార్థోవత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్.

సకలోపనిషత్తులు గోవులు వంటివి. గోపాల నన్దనుడు పాలు పితికే వాడు. మనకు సకల ఉపనిషత్తులను చదివే సమయం లేదని శ్రీకృష్ణుల వారికి తెలుసు. అన్ని గోవులను (ఉపనిషత్తులను) ఒక్క చోట చేర్చారు. వాటి క్షీరాన్ని పితికాడు. ఎవరి కోసం? పార్థోవత్సః అర్జునుడనే లేగదూడకు మహత్తరమయిన గీతామృతమే పాలు. సద్బుద్ధి కలవాడే ఆ పాలను త్రాగేవాడు. కొంచెం అర్జునుడు త్రాగి మిగిలినది మనందరకు పంచి పెట్టాడు.

భగవద్గీతా కించి దధీతా
గంగాజల లవకణికా పీతా
సకృదపి యేన మురారి సమర్చా
క్రియతే తస్య యమేనన చర్చా ॥

అంటే భగవద్గీతను శ్రద్ధతో ఒకింత చదివినా అధ్యయనం చేసినా, గంగాజలాన్ని కొద్దిగా త్రాగినా, విష్ణుభగవానుని ఒకసారి పూజించినా ఇక యముడు వారి చెంతకు పోనేరడు.

మనందరము పోవలసిన వాళ్లమే. కాని భయపడకూడదు. మరణ భయమున్నప్పుడు జీవితమే భయమనిపిస్తుంది. మరణ భయము లేని వారికి జీవితంపై భయముండదు, భగవంతునిపై భక్తి, శ్రద్ధ నమ్మక ముంటే ఇక భయమెందుకు? మనము సత్సంగంలో వుంటే మనకు ఎట్టి భయములు కలుగవు. చెప్పలేని మానసిక బలం చేకూరుతుంది. మనశ్శాంతి కల్గుతుంది. సత్సంగానికి దూరమయితే శాంతికి దూరమవుతాము. ఇదే శ్రీ శంకరాచార్యులు అంటారు:

సత్సంగత్వే నిస్సంగత్వమ్
నిస్సంగత్వే నిర్మోహత్వమ్
నిర్మోహత్వే నిశ్చలతత్వమ్
నిశ్చలతత్వే జీవన్ముక్తిః

ఈ శుభదినం శాంతికై మనమందరం ఆ గోపాలనందుని ప్రార్థిద్దాము. అది మన ప్రయత్నం వలన కలిగేది కాదు. ఆ భగవంతుని అనుగ్రహం కావాలి. అన్ని సమయాలలో మనం శాంతచిత్తులమై వుండాలి. అప్పుడే మనకు విజయం తథ్యం. మన కర్మలను, ఆశించే ఫలితాలను అన్నిటినీ భగవంతునికి అర్పించాలి.

యత్ర యోగీశ్వరః కృష్ణో
యత్ర పార్థో ధనుర్ధరః
తత్ర శ్రీర్విజయో భూతి
ర్ధ్రువా నీతిర్మతిర్మమ (భ.గీ. 18-18)

ఎక్కడ యోగేశ్వరుడగు శ్రీకృష్ణుడును, ఎక్కడ ధనుర్ధారియగు అర్జునుడునూ ఉందురో అచట సంపద, విజయము, ఐశ్వర్యము, దృఢమగు నీతి ఉంటాయని నా అభిప్రాయమని సంజయుడు పల్కుచున్నాడు.

అరుణాచలశివ

## శ్రద్ధాంజలి

శ్రీరమణ భగవాన్ భక్తులు, మన కేంద్ర సభ్యులు అయిన **శ్రీ ఎస్.వి. రాజేశ్వర్ గారు** జూన్ 1వ తేదీన అకస్మాత్తుగా పరమ పదించారు అని తెలియచేయుటకు చింతించుచున్నాము. వారు 2014-15 సంవత్సరములో రమణ కేంద్రం ప్రెసిడెంట్‌గా వ్యవహరించారు. వారు శ్రీరమణజ్యోతికి, తెలుగు సంపాదకీయ వర్గమునందు సభ్యునిగా విలువైన సేవలు అందించారు. వారు మన మధ్యలో లేకున్నను వారి స్మృతులు, సేవలు చిరస్మరణీయము. వారి ఆత్మకు శాంతి కలగాలని శ్రీరమణులను ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేయుచున్నాము.

# భగవాన్ ఉపదేశసారము - గణపతి ముని వ్యాఖ్యానము

- పింగళి సూర్యసుందరం

10వ శ్లోకం: హృత్‌స్థలే మనః స్వస్థతా క్రియా ।

భక్తియోగ బోధాశ్చ నిశ్చితం ॥

అర్థం: మనస్సుని తన నిజస్థానమైన హృదయంలో నిలపడమే కర్తవ్యం. అదే భక్తిలో, యోగంలో, జ్ఞానంలో ముగుస్తుంది. సందేహం లేదు.

వ్యాఖ్యానం: హృదయస్థలమంటే ఆత్మ. మనస్సుని ఈ కేంద్రంలో పెట్టాలి. ఇదే చేయవలసినది. ఇది చేస్తే భక్తీ, యోగమూ, జ్ఞానమూ కలుగుతాయి. ప్రశాంతమైన మనస్సు తన జన్మస్థానమైన హృదయంలో నిలబడటమే అన్ని కార్యాల కన్నా ఉత్తమమైనది. భక్తి, యోగ జ్ఞానాలకు పరాకాష్ట యిదే.

11వ శ్లోకం: వాయురోధనా ల్లీయతే మనః ।

జాల పక్షి వ ద్రోధ సాధనం ॥

అర్థం: శ్వాసను బంధిస్తే వలలో చిక్కిన పక్షి వలె మనస్సు నిశ్చల మవుతుంది. ఇది మనో నిగ్రహానికి ఒక పద్ధతి.

వ్యాఖ్యానం: శ్వాసని బంధించడం వల్ల గాని, శ్వాసని నియంత్రించడం వల్ల గానీ వలలో చిక్కిన పక్షివలె మనస్సు పూర్తిగా నిశ్చలమవుతుంది. అంతేకాక, కుంభకాన్ని అభ్యాసం ద్వారా అలవరచుకుంటే కూడా ప్రాణాన్ని నిరోధించవచ్చు. ఇక శ్వాసక్రియను (ఉచ్ఛ్వాస నిశ్వాసాలను) గమనిస్తూంటే శ్వాస క్రమబద్ధమవుతుంది. రాజ యోగంలో చెప్పే కుంభకానికి ఈ విధమైన కుంభకం వ్యతిరేకం కాదు.

శ్రీ రమణగీతలో శ్రీ భగవాన్ వివరించినట్లు, శ్వాస క్రియను గమనిస్తూంటే కుంభకం కలుగుతుంది. ఈ పద్ధతినే మహర్షి ఆమోదించి నట్లు తెలుస్తుంది.

12వ శ్లోకం: చిత్త వాయవశ్చిత్క్రి యా యుతాః ।
శాఖయోర్ద్వయీ శక్తి మూలకా ॥

అర్థం: మనస్సులూ, శ్వాసలూ, చైతన్యంతో, కార్యాచరణతో కలిసి ఉంటాయి. ఈ రెండూ ఒకే శక్తికి చెందిన రెండు కొమ్మల వంటివి.

వ్యాఖ్యానం: చైతన్యంతో కూడిన మనస్సులకూ, క్రియాశీలతతో కూడిన శ్వాసలకూ మూలం భగవంతుని శక్తే. దీని అర్థమిది: ఆ ఆదిశక్తికి గల జ్ఞానశక్తికి ప్రతీకలు మనస్సులైతే, ఆ ఆదిశక్తికి గల క్రియాశక్తికి ప్రతీకలు శ్వాసలు. మనస్సులూ, శ్వాసలూ అంటూ బహువచనంలో చెప్పడంలో ఉద్దేశం, జనబాహుళ్యానికి ఆ రెండూ ఉండటమే. మనస్సూ, శ్వాసా రెండూ కూడా భగవంతుని శక్తికి శాఖలే కాబట్టి ఆ రెండూ కూడా పరమశక్తిని చేరుకోవడానికి ఉపకరించేవి.

13వ శ్లోకం: లయవినాశనే ఉభయరోదనే ।
లయగతం పున ర్భవతి నో మృతం ॥

అర్థం: లయమయి పోవడం, నశించి పోవడం - రెండు విధాలైన నియంత్రణలు. లయమయినది తిరిగి రావచ్చు, కాని నాశనమైనది తిరిగి రాదు.

వ్యాఖ్యానం: లయమూ, నాశనమూ రెండు రకాల నియంత్రణలు మనస్సుకి - లయమొందిన మనస్సు మళ్లీ జన్మిస్తుంది, నాశనమైన మనస్సు జనించదింక. లయమవడమంటే మానసిక వ్యాపకాలు ఆగి పోవడం, మనోలయమైన యోగికి సమాధీ, క్రియాశీలతా ఒక దాని తరువాత ఒకటి సంభవిస్తాయి. నాశనమంటే "నేను" అనే భావం

యొక్క నాశనం. అన్ని కార్యకలాపాలకీ మూలం ఈ "నేను" అనే భావమే కదా! మనస్సుని నాశనం చేసిన యోగి ఎప్పుడూ సమాధిలోనే ఉంటాడు.

14వ శ్లోకం: ప్రాణబంధనా ల్లీన మానసమ్ ।
ఏక చింతనా న్నాశ మే త్యదః ॥

అర్థం: ప్రాణాన్ని నియంత్రించడం వలన మనస్సు లయమొందు తుంది. ఒకే చింతన వలన అది నాశనమవుతుంది.

వ్యాఖ్యానం: క్రిందటి శ్లోకంలో చెప్పినట్లు శ్వాసను నియంత్రిస్తే మనస్సు లయమవుతుంది. (అంటే, శ్వాసక్రియని ఆపేసినా, క్రమబద్ధం చేసినా అన్న మాట). అట్టి మనస్సు ఒకే భావం మీద లగ్నమైతే అది నాశనమవుతుంది. అంటే, ఆత్మకి అభిన్నమన్న భావంతో ఉంటే. ప్రాణాన్ని నియంత్రిస్తే మనస్సు లయమవుతుంది అంతే. అది మనో నాశనాన్ని కలిగించదు. ఆ లయమైన మనస్సు ఏకతనే చింతిస్తే మనో నాశనమవుతుంది.

15వ శ్లోకం: నష్ట మానసో త్కృష్ట యోగినః ।
కృత్య మస్తి కిం స్వస్థితిం యతః ॥

అర్థం: మనస్సుని నాశనం చేసి తన నిజస్థితిని చేరుకున్న యోగి ఇంక వేరే చేయవలసినదేముంది?

వ్యాఖ్యానం: మనస్సుని నాశనం చేసి ఆత్మలో నిలకడగా ఉండే మహా యోగి వేరే చేయవలసిన దేముంది? అంటే, మనస్సుని నాశనం చేస్తే ఇంక వేరే చేయవలసినదేమీ లేదన్న మాట.

16వ శ్లోకం: దృశ్య వారితం చిత్తమాత్మనః ।
చిత్త్వ దర్శనం తత్త్వ దర్శనం ॥

అర్థం: దృశ్యమానమైన వాటి నుండి మనస్సు విముఖమైతే కలిగేది ఆత్మ చైతన్య దృష్టే. అదే సత్య దర్శనం.

వ్యాఖ్యానం: బాహ్య వస్తుజాలాన్ని విడిచి, అంతర్ముఖమైన మనస్సు ఆత్మ చైతన్యాన్ని దర్శిస్తుంది. ''నేతి నేతి'' అంటూ ఇంద్రియ గోచరమైన వాటి నన్నిటినీ తిరస్కరించే మనస్సు ఆత్మానుభూతిని పొందుతుంది. బహిర్ముఖం కాకుండా, నిద్రలో పడిపోకుండా, ఉండే మనస్సు ఆత్మ చైతన్యాన్ని దర్శిస్తుంది. ఈ దర్శనమే సత్యదర్శనం.

17వ శ్లోకం: మానసంతు కిం మార్గణే కృతే ।

నైవ మానసం మార్గ ఆర్జవాత్ ॥

అర్థం: మనస్సేమిటని వెతికితే, అసలు మనస్సే లేనట్లు తెలుస్తుంది. ఇదే సూటియైన మార్గం.

వ్యాఖ్యానం: మనస్సేమిటని విచారణ మొదలు పెడితే, అంటే దాని రూపమేమిటని విచారిస్తే, చివరికి మనస్సంటూ ఏమీ లేదని తెలుస్తుంది. విచారణ చేసేవాడే మనస్సు యొక్క అసలు రూపం. అది అతని నుండి ఉదయించిన కిరణం మాత్రమే. విచారణ చేసేప్పుడు ఆ ఉదయించే కిరణం ఆత్మతో కలుస్తుంది. అప్పుడు మనస్సే ఉండదు. ఇది శ్రీ భగవాన్ బోధ. ఈ మార్గమే సూటి అయినది.

## మనవి

రమణజ్యోతి పత్రికలో ప్రచురితమయ్యే రచనలలో వ్యక్తమయ్యే అభిప్రాయాలు కేవలం రచయితల సొంతవి మాత్రమే. పత్రిక యాజమాన్యం, సంపాదక వర్గాలకు వీటితో ఎలాంటి సంబంధం లేదు.

# శ్రీ భగవాన్ పాద సన్నిధిలో (At the feet of Bhagavan)

ఆంగ్లమూలం: సుందరేశ అయ్యర్
(గత సంచిక తరువాయి) తెలుగు అనువాదం: జి. శ్రీహరిరావు

## సమాప్తి

గౌతమ బుద్ధుని అంత్యకాలంలో వారు చేసిన చివరి బోధనలలో యీ మాట భద్రపరచబడింది. "అన్ని మిశ్రమాలూ కరిగి పోతాయి. అందువలన దుఃఖించ అవసరము లేదు". మన హృదయాలలో ఎంతో కాలము భద్రపరుచుకున్న శ్రీ భగవాన్ దివ్యమానవ రూపము కూడా ఒక భౌతిక మిశ్రమమే. కాలాంతరమున మనమెంతో ప్రేమతో నింపుకున్న ఆ రూపము వివిధ ధాతువులుగా విడి కనుమరుగై పోయింది.

అదే విధంగా శ్రీకృష్ణపరమాత్మ కూడా తనను అమితంగా ప్రేమించే గోపికలనుండీ తన భౌతిక రూపాన్ని మరుగుపరిచి, వారు అంతర్ముఖంగా తనపై ప్రేమను పెంచుకోవాలని కాంక్షించారు. ఈ ఉద్దేశంతో, ఆయన గోపికల వద్దకు వెళ్ళి వారి హృదయాలలో తాను ఎల్లప్పుడూ నాట్యము చేయుట గాంచుటయూ, తన సన్నిధిలో నిత్యమూ నివసించుటయూ యెట్లు సాధ్యమో తెలియపరచమని ఉద్ధవుని పంపెను. మనసారా ప్రేమించిన వారిని (పరమాత్ముని) భౌతిక నేత్రములతోకాక అంతర్దృష్టితో (హృదయనేత్రముతో) చూడగలిగిన నాడు భగవంతుని దివ్యసన్నిధిని తాదాత్మ్యముగా అనుభవించగలరు.

మా అనుభవము కూడా అట్టిదే. ఆ రోజు, 1950 ఏప్రిల్ 14 సాయంకాలము, శ్రీ భగవాన్ అదృశ్యమైపోయిరి. అంతవరకూ మా హృదయ నేత్రాలకు కేంద్రబిందువయిన శ్రీ భగవాన్ దివ్యసుందర విగ్రహము

కనుమరుగై పోయినది. వారు నిర్యాణమయిరని అందుమా? శ్రీ భగవాన్‌కు మరణమా? ఆ పదమునకు అర్థము లేదు. యావత్ప్రపంచ మంతటనూ జీవించియుండు శ్రీ భగవాన్‌ను మృత్యువు స్పృశించు టయా?'' నేనెచ్చటకో వెళ్ళిపోదుననియా మీ ఆలోచన? నేనెక్కడికీ వెళ్ళను. మీ తోడనే వుందును''. అది ఎడబాటుకు ముందు, మమ్ములనందరినీ ధైర్యముతో వుంచుట కోసము వారిచ్చిన మాట. వారిని ఆరాధించు మేమందరమూ, తిరువణ్ణామలలో వారి సన్నిధిలోనే వున్నామను విశ్వాసముతో జీవనము సాగిస్తున్నాము. ఎప్పటివలెనే శ్రీ భగవాన్ తామిచ్చిన మాట ప్రకారము ఆశ్రమములోనే వున్నారనీ వారితో సంభాషించగలమనీ మా అందరి ప్రగాఢ విశ్వాసము.

అంతర్గతమయిన కాంతిని స్పష్టముగా చూడగలుగుటకు శ్రీ సూర్‌దాస్ తన భౌతిక దృష్టిని పోగొట్టుకొనిరి. శ్రీ భగవాన్ కూడా మా పట్ల కృపతో అట్లే చేసిరి. బాహ్యమయిన వారి భౌతిక శరీరకాంతిని కాక, అనంతమయిన వారి ఆత్మజ్యోతిని దర్శించగల శక్తిని మనకు ప్రసాదించి దీవించిరి. మనకు సుపరిచితమయిన బాహ్యరూపమునకు తెర దింపి, వారి శాశ్వత సన్నిధిని మన హృదయాంతరాళములో అనుభవించి ధన్యులము కమ్మని వారి అనుగ్రహ సూచన.

ఆ తెరమరుగు మనకు యెంతో బాధాకరమయిన విషయము. ఆ యెడబాటు దుర్భరము. కాని, సచ్చిదానంద స్వరూపులైన శ్రీ భగవాన్ మన ఆత్మలకు ఆత్మయై, దివ్య ప్రకాశమై, మన ఉనికికి మూలస్థానమై, సర్వాంతర్యామియై మన అంతర్దృష్టికి నిరంతర దర్శనము ప్రసాదిస్తూ మనలను ధన్యులను చేయుచున్నారు.

మాటలతోనూ, చేష్టలతోనూ మనకు బోధించు సమయములలో, మన హృదయములు ఆనందముతో, అనురాగముతో పొంగి

పారలినవి. ఈ రోజు వారిని కాంచుటకు, అవే హృదయ చక్షువులు అంతర్ముఖములై, రాత్రి, పగలు అను తేడా లేక ఆ పరమాత్ముని కరుణలో ఓలలాడుచున్నవి. శ్రీ భగవాన్ ప్రేమకూ, శక్తికీ, జ్ఞానమునకూ, కరుణకూ నిరాటంకము, నిరవధికము అయిన అవధులు లేని అంబుధి.

రాళ్ళు, రప్పలతో నిండిన ఆ పర్వత మార్గముపై యింతకాలమూ చరించిన ఆ పవిత్ర చరణముల వద్ద మన కృతజ్ఞతా పూర్వక స్మరణాంజలిని సమర్పించెదము గాక. అజ్ఞానాంధకారములో కొట్టు మిట్టాడుచున్న మన అందరి నివేదనలను, అల్పమైన మన హృదయ కుసుమాలను వారు స్వీకరింతురు గాక. మనపై వారి కరుణాధారను ప్రవహింప చేయుదురుగాక. శ్రీ భగవాన్ ప్రసరించు కాంతి భగవంతుడే ప్రసాదించు దివ్యకాంతి. ఎట్టి సందేహమూ లేదు. (సశేషం)

## రచనలకు ఆహ్వానం

శ్రీ రమణజ్యోతిలో ప్రచురణార్థం రచనలను ఆహ్వానిస్తున్నాం. రచనలు వ్యవహారిక భాషలో ఉండాలి. భగవాన్ శ్రీరమణ మహర్షికి సంబంధించిన గద్య/పద్య/గేయ రూపాలలో 2 లేక 3, 4 పేజీలకు పరిమితమైన స్వీయ రచనలుగా ఉండాలి. రచనలకు ఎట్టి పారితోషికము లభించదు. ప్రచురణకు అంగీకరింపబడని రచనలను తిరిగి పొందగోరువారు తగినంత పోస్టేజి (స్టాంపులు) అంటించబడి తమ అడ్రసు వ్రాయబడిన కవరును జత చేయాలి. రచయితలు తమ విద్యార్హతలు, వయస్సు, అడ్రసు, రచనా వ్యాసంగంలో తమ అనుభవం, తదితర వివరాలను క్లుప్తంగా తెలియపరచాలి.

# కర్మ సిద్ధాంతం

(మౌంటెన్‌పాత్' జనవరి-మార్చి 2015, సంపుటి-52, సంచిక-1లో "ద లా ఆఫ్ కర్మ" అన్న శీర్షికతో ప్రచురితమైన సంపాదకీయం నుండి ఎన్నుకొనబడిన భాగాల అనువాదం)

అనువాదం: డా॥ వి. రామదాస్ మూర్తి

కర్మ సిద్ధాంతం దండన కోసం ఉద్దేశింపబడిందని పొరబడరాదు. అది ప్రధానంగా కర్మలు, వాటి ఫలితాలను విశదీకరిస్తుంది. కర్మలు అనంతాలు, అనేకాలు. ఏ రెండు కర్మలు గాని, కాలక్రమంలో ఏ రెండు క్షణాలుగాని ఒకటిగా వుండవు. ప్రతి క్షణానికి దాని విశిష్టత వుంటుంది. ప్రతి ప్రాథమిక చర్యకు తొందరలోగాని, ఆలస్యంగా గాని ఎప్పుడో ఒకప్పుడు ఫలితం వుండి తీరుతుందన్నది ఏ అనుమానమూ లేని నిజం. ఈ సిద్ధాంతం మనకు మార్గదర్శకంగా వుండడానికి ఏర్పడింది గాని అదే పనిగా దండించడం కోసం కాదు.

ఈ విశ్వం సత్వ, రజస్, తమో గుణాల సమ్మిశ్రమం. అవి కర్మ ఫలితాల తీరును వర్ణిస్తాయి. సత్వగుణం మన చైతన్యాన్ని ఉత్తేజ పరుస్తుంది. రజస్సు తటస్థంగా వున్నప్పటికి, అసలైన చర్యకు విధి విధానాలను నిర్దేశిస్తుంది. తమస్సు అజ్ఞానాన్ని ఆహ్వానిస్తుంది, మన చైతన్యాన్ని బలహీనపరుస్తుంది.

మన ప్రవర్తనాశైలి, ఆలోచన, అనుభూతులు సుఖానికి దోహద పడేవో లేదా దుఃఖానికి దారితీసేవో అని అవగాహన చేసుకోవడమో, మనసు, హృదయాల యొక్క పిచ్చి తలపులకు బానిస కావడమో, వీటిలో దేనినైన ఎన్నుకునే స్వేచ్ఛ మనకు వుంది. శాంతి, సఖ్యతలను పెంపొందించే పరిశుద్ధ మనసు ఆనందాన్ని పంచుతుంది. అది వ్యతిరేక తత్వాన్ని, కోపతాపాలను దరికి రానీయదు. ఇక దుఃఖం అందుకు వ్యతిరేకమైన దిశ తీసుకుంటుంది. అది వైరం, ఆగ్రహాలను పెంచి పోషిస్తుంది. మనోహృదయాలను అవినీతికరం చేస్తుంది.

అజ్ఞానంతో ఏర్పడిన ఆలోచనను మనం అలాగే పట్టివుంచితే అది అదే తరహాలోనే భావోద్రేకాన్ని కలిగిస్తుంది, చర్యలకు దారి తీస్తుంది. విషపూరితమైన ఆలోచనను త్రుంచివేయాలంటే దాన్ని కొనసాగనీయ రాదు. ఆలోచనలకు అస్తిత్వం లేదన్నది మనకు భగవాన్ రమణుల ద్వారా తెలిసిన విషయమే. భ్రమ కారణంగా భావింపబడిన ''నేను'' మీద అది ఆధారపడి వుంటుంది. మన అహంకారం ఆలోచనలు, ఉద్వేగాల యొక్క కలగాపులగం, కలగూరగంప. అది గాఢమైన జ్ఞాపకాలు, ముద్రల యొక్క ప్రభావ ఫలితం. అనాలోచితంగా వాటితో మమేకం కావడం వల్ల వాటిలోనే మునిగిపోతాం.

అజ్ఞానంతో మమేకం కాకుండ శుద్ధ చైతన్యంలో కలిసి వుండడం మన స్వధర్మం. ఋణాత్మక వ్యతిరేక స్వభావాన్ని పెంచి పోషించకపోతే, అదే పూర్వపు ఆలోచనల పటుత్వాన్ని బట్టి అజ్ఞానం హరించుకు పోతుంది. పూర్వకర్మలను అనుసరించి సంస్కార ప్రభావ శక్తి ఆధార పడి వుంటుంది. దానికి అనుగుణంగా ప్రతిఫలాలను ఇస్తుంది. మూర్ఖులు తప్ప బాధలను కొనితెచ్చుకోవాలని ఎవరు కోరుకుంటారు?

మన ఆలోచనలకే మనల్ని ప్రభావితం చేయగల శక్తి వుందని గ్రహించడం ముఖ్యం. ఆలోచనలంటే అవేవో అలా గాలికి కొట్టుకు వచ్చి మనమీద ప్రభావం చూపకుండ వచ్చినదారి వెళ్ళిపోయేవి కావు. ఆలోచన ఎంత గట్టిదైతే, మన చర్యలపై దాని ముద్ర కూడ అంత లోతుగా వుంటుంది. అందుకే సజ్జనులతో సాంగత్యం ఏర్పరచుకొనడం ముఖ్యం. మనమేమిటో నిర్ధారించేది మనం తినే తిండి ఒకటే కాదు. మనం ఎవరితో సంపర్క, సాన్నిహిత్యాలు చేస్తున్నామో వాటి మీద కూడ ఆధారపడి వుంటుంది. సాధు, సజ్జనుల సాంగత్యం వల్లను, వారి భౌతిక సామీప్యత, వారి సద్భాషణలు, జ్ఞాపకాల ద్వారాను మన ఆత్మలపై కొంతైనా మంచి ప్రభావం పడుతుంది.

మన కోరికలు, ఆలోచనలు, భావోద్రేకాలపై నిఘా వుంచుకొనడం చాలా అవసరం. స్వామి పరమహంస యోగానంద శిష్యుడొకరు "మేము ఉద్దేశ్యపూర్వకంగా కాకుండ, తప్పు అని తెలుసుకోలేని కారణంగా చేసిన కర్మలకు శిక్షింపబడడం అన్యాయం" అని అన్నారట. స్వామి "అజ్ఞానమూ, తెలియకపోవడం అన్నవి చట్టాన్ని మార్చలేవు. పరధ్యానంగా కారునడిపి చెట్టుకు గుద్దినపుడు, పరధ్యానం వల్ల ప్రమాదం జరిగిందని గాయాలు తక్కువగా తగులుతాయా? చట్టానికి అనుగుణంగా ప్రవర్తించడం అలవరచుకోవాలి. యోగేశ్వర్‌జీ అన్నట్లు మనిషి నమ్మకాల ప్రకారం చట్టాలు పని చేయాలంటే ఈ ప్రపంచం గందరగోళమయమౌతుంది" అని జవాబిచ్చారట.

తప్పులు, పొరబాట్లు, పాపాలు, అజ్ఞానం, సోమరితనం - ఇలా ఎన్ని చెప్పుకుపోయిన - మనం అధిగమించలేమనిపించే సవాళ్ళను ఎదుర్కొంటున్నాం. ఆలోచించి చూస్తే, మన పరిస్థితి ఆశాజనకంగా లేదు. పునర్జన్మను నమ్మినప్పుడు మనం లెక్కలేనన్ని సార్లు పుట్టి, కొండంత కర్మల్ని మూటకట్టుకున్నాం. తెలిసో, తెలియకో ఆచరించిన అన్ని కర్మల ఫలితాల నుండి ఎలా తప్పించుకుంటాం? మనకు పట్టుకున్న మరొక అపనమ్మిక మరింతగా సమాచారం, జ్ఞానం, ధనం, హోదా వీటిని అధికంగా ఆర్జిస్తే సంతోషమెక్కువవుతుందన్నది. ఆలోచనలు, సమాచారం అధికమయ్యే కొద్ది, పరిస్థితి మెరుగుకాదు, సరిగదా ఎలా నడుచుకోవాలో తెలియక మెదడులో గందరగోళం ఎక్కువవుతుంది. ఏది ప్రధానమైనదో తెలుసుకునేందుకు పెక్కు విషయాలు తెలుసుకోవలసిన పనిలేదు. రమణమహర్షి విషయం పరిశీలించండి. మరణం అసత్యం, భ్రమ అనే ఒక విషయాన్ని శాశ్వత ప్రాతిపదికన అవగాహన చేసుకున్న ఒక్క కారణంగా, ఆ జ్ఞానజ్యోతిలో కలిసిన భగవాన్ మళ్ళీ వెంకట్రామన్ అనే బాలుడిగా మాత్రం తిరిగి రాలేదు. తామే లెక్కలేనంతమందిని సరియైన మార్గంలో పెట్టగలిగారు.

సర్వోత్కృష్టమైన ఒక ఆలోచన, ఒక దైవికపరమైన భావోద్రేకం, ఒక జ్ఞానితో హృదయం విప్పి సమాలోచన, వ్యక్తి జీవితంలో సమూల మైన మార్పును తీసుకు రాగలదు. గతచరిత్ర భస్మీపటలం చెందడానికి అలాంటి ఒక క్షణం చాలు. ఎంతో చీదర పుట్టించే అనుభవాలను ఎదుర్కొని, ఎంత ప్రయత్నించినప్పటికి పరిష్కరింపజేయలేని అనేక సందర్భాలు జీవితంలో ఎదురవుతూనే వుంటాయి. కాని ఎప్పుడో హఠాత్తుగా కనురెప్పపాటులో అవి ఎక్కడికక్కడ చిక్కువీడి ఏదో అద్భుతం జరిగినట్లు బాధించడం మానేస్తాయి. సంఘటనలు ఎన్ని అన్న దానితో సంబంధం లేకుండ వాటికి యథార్థమైన స్వతంత్ర ప్రతిపత్తి లేదన్నది గుర్తెరగడమే అలాంటి హఠాత్పరిణామానికి కారణం. అసలు సమస్య వాటితో మనం మమేకం కావడమే. మనం ఒక చీకటి గదిలోనికి ప్రవేశించి, లైటు వెలిగిస్తే, చీకటి మాయమవుతుంది. అది ఎక్కడికి వెళ్ళినట్లు? ఎక్కడికీ పోలేదు, ప్రకాశం యొక్క సమ్ముఖంలో దానికి అస్తిత్వం లేదు.

సాధనామార్గపు ప్రయాణంలో మన జన్మాంతర సంస్కారాల ఫలితంగా కొంతకాలం అడ్డంకులు తలెత్తినప్పటికి, అవి మనల్ని ఎల్ల కాలం ప్రభావితం చేస్తూ వుండలేవు. భగవాన్ పట్ల మన ప్రగాఢమైన భక్తి ఫలితంగా మనం దేనినుండి తప్పించుకోలేమో, దాన్ని ఐచ్ఛికంగా అనుభవించే శక్తిని సంపాదించుకున్నాం. దాన్ని ధ్యేయంగా పెట్టుకుని కాలం గడిపితే, ముక్తి సాధనకై మనం చెందే ఆరాటం విజయవంతమై తీరుతుంది. అలా ఆలోచనాసరళిని దిద్దుకుని మనోహృదయాల పవిత్రీకరణను సాధించడం ఎలాగ? దానికి రెండు మార్గాలు - ఒకటి క్రమేపి ఏర్పడేది, మరొకటి హఠాత్తుగా జరిగేది.

చేసిన కర్మ ఒక కాంక్రీటు దిమ్మెలాంటిదని ఊహించుకుంటే, దాంట్లో ఇరుకున్న మనల్ని తన బరువుతో దిగజారుస్తూ, మన

దృక్పథాన్ని, ప్రవర్తనను ప్రభావితం చేస్తుంది. మన విచక్షణా జ్ఞానానికి అడ్డు తగిలి తప్పుడు కర్మలకు పురిగొలుపుతుంది. ప్రార్థన, మంత్రజపం, వంటి ఆమోదించబడిన ఆచారాలు, ప్రాణాయామం, ఆరోగ్యకరమైన జీవనశైలి, గుణాత్మక ఆలోచనలు, ధ్యానం మొదలైనవి ఆచరిస్తే, ఆ దిమ్మె క్రమంగా కరిగి మనం విడిపడతాం. అజ్ఞానం, తమస్సులతో క్రుంగిపోతున్న మనలో నిదానంగా, క్రమేపీ పవిత్రీకరణ జరిపే ప్రక్రియ ఇది.

ఇక రెండవది, అలాంటి ఆలోచనలు ఉదయిస్తున్న మూలాల్లోనికి పోవడం. అది ఎలా తలెత్తుతోందో గమనించి తెలుసుకుని, వేళ్ళతో పెకిలించడం. దానికి భగవాన్ ఆత్మవిచారణ మార్గాన్ని సూచించారు. అతి సున్నితమూ, శక్తివంతమూ అయిన ఈ అన్వేషణ ధారపోసి, మనం కానిదాన్ని దేనిని మనం మనమను కొంటున్నామో దాని నుండి మనల్ని దూరం చేసి, మన సమయం, శక్తులను ఆ భావనకై వృధా చేయకుండ సహాయపడుతుంది.

భగవాన్ మాటల్లో చెప్పాలంటే “వస్తువులు, విషయాలకు సంబంధించిన ‘ముద్రలు’, లోతైన భావనలు వున్నంత కాలం, ‘నేను ఎవరు?’ అన్న ఆలోచన జరగాల్సిందే. ఉదయించే ఆలోచనను అక్కడే త్రుంచివేయాలి. ఆత్మగురించి నిర్విరామంగా ధ్యాస వుంచి దాన్ని సాధించే వరకు జరిపే అన్వేషణ ఒకటే చాలు. కోటలోపల శత్రువులు వున్నంతకాలం దండయాత్ర సాగుతూనే వుంటుంది. వస్తున్న వాటిని వస్తున్నట్లే హతమారుస్తుంటే కోట మన అధీనమవుతుంది”.

కర్మ సిద్ధాంతం ప్రకారం, మన చర్యల ఫలితాలు మనల్ని వెన్నాడుతూనే వుంటాయి. తప్పుడు సంకేతాలు వస్తూనే వుంటాయి, బాధలు కలుగుతూనే వుంటాయి, గందరగోళం వుండనే వుంటుంది. కాని ఆఖరుకు భగవాన్ కృప మనకు విజయాన్ని అందించి తీరుతుంది.

# మరణానుభవము - ఆత్మయొక్క ఉనికికి నిదర్శనము

- వంగర శ్యామసుందరి

జగద్గురు ఆదిశంకరాచార్యుల వారు, భజగోవింద శ్లోకంలో మానవ జీవితం గురించి ప్రస్తావిస్తూ ఇలా అంటారు. 'బాలస్తావత్ క్రీడాసక్తః, తరుణాస్తావత్ తరుణీసక్తః, వృద్ధస్తావత్ చింతాసక్తః, పరే బ్రహ్మణికోపి నసక్తః" అనగా మనిషి జీవితం బాల్యంలో ఆటలయందు ఆసక్తితోనూ, యవ్వనంలో స్త్రీలయందు ఆసక్తితోనూ, వృద్ధాప్యంలో చింతతోనూ గడిచి పోతుంది. కాని శాశ్వతమైన, నిత్యమైన సత్యము నందు ఎవరికీ ఆసక్తి ఉండదు.

నిజానికి సత్యము మనకు బాహ్యంగా లేదు. మనలోనే ఉన్నది. అయితే మన ఇంద్రియాలు బాహ్యమైన విషయాలను మాత్రమే గ్రహించే విధంగా సృష్టింపబడినాయి. అందుచేత మోక్షేచ్ఛ కలవారు, వివేక వైరాగ్యములతో, మనస్ఫూర్తిగా, సూక్ష్మబుద్ధితో నిరంతరం 'నేనెవడను?' అన్న ప్రశ్నతో అంతర్ముఖులవ్వాలి.

భగవాన్ శ్రీరమణ మహర్షికి 1896లో, వారి 16వ యేట మరణాను భవం కలిగింది. దీని ద్వారా వారికి ఆత్మసాక్షాత్కారమయినది. 1912లో అనగా వారి 33వ యేట రెండవసారి మరల మరణానుభవం కలిగింది. ఆ అద్భుతమైన అనుభవాల వివరాలు ఏమిటి?

1896లో, ఆయనకు ఎటువంటి శారీరకమైన, మానసికమైన ఆరోగ్య సమస్యలు లేకపోయినా, అకస్మాత్తుగా విపరీతమైన మృత్యు భయం కలిగింది. ఈ భయం ఆయనను అంతర్ముఖుణ్ని చేసింది. ఆయన తనలోతాను యిలా అనుకున్నారు "సరే! చావు వచ్చింది దీని అర్థమేమి? చనిపోయేదేమిటి? ఈ దేహం చనిపోతుంది. శరీరం చని

పోతే "నేను చనిపోయినట్లేనా? నేను ఈ శరీరమేనా? ఈ శరీరం నిశ్చలంగా, జడంగా ఉన్నది. కాని నాకు చైతన్యశక్తి ఉన్నట్టు తెలుస్తున్నది. 'నేను' అన్న శబ్దం కూడా లోపల నుండి వినబడుతున్నది. కాబట్టి 'నేను' అన్నది దేహానికి అతీతమైన శక్తి. భౌతిక దేహం చనిపోతుంది. కాని ఆ చైతన్య శక్తిని మృత్యువు తాకలేదు. కాబట్టి చావులేని చైతన్యమే నేను".

మరల 1912లో రెండవసారి మృత్యు అనుభవం వెంటవెంట మూడు మార్లుగా కలిగింది. ఈ సంఘటన భగవాన్, వాసుదేవ శాస్త్రి గారు (భగవాన్ భక్తుడు), ఇంకా కొంతమంది భక్తులు స్నానార్థం పచ్చైయ్యమాళ్‌కొవెల వద్ద కోనేటిలో స్నానం చేసి, కొండకు తిరిగి వెళ్తూండగా తాబేటి బండ వద్ద జరిగింది. ఈ సంఘటన గురించి భగవాన్ యిలా చెప్పారు:

"హఠాత్తుగా ఎదురుగా ఉన్న దృశ్యం మాయమై దృష్టిపథానికి అన్ని వైపుల అడ్డంగా ఒక తెల్లని తెర వేయబడినట్లు అన్పించింది. రక్త ప్రసరణ, హృదయచలనము ఆగిపోయినాయి. దేహం నీలిరంగులోకి మారింది. ఈ పరిణామం క్రమక్రమంగా జరిగింది. కొంతసేపు ఆ తెర, కొంతసేపు ప్రకృతి, మారి, మారి కన్పిస్తూ ఆ తర్వాత ప్రకృతి పూర్తిగా మాయమయింది. రెండవసారి యిలా జరగగానే బలహీనత ఎక్కువయి చీకటిగా అన్పించసాగింది. వెంటనే ఒక రాయిని ఆనుకుని నిలబడ్డాను. మరల మూడవసారి కూడా అలా అన్పిస్తే ఆ బండ దగ్గరే కూర్చున్నాను. చుట్టూ మొత్తం ఆ తెల్లని తెరతల వణుకుతున్నది. రక్త ప్రసరణ, హృదయచలనము ఆగిపోయినాయి. చర్మం నల్లబడి పోయింది. అది మృత్యువు వేళ వచ్చే నలుపు. దేహానికి మృత్యు లక్షణాలన్నీ వచ్చినప్పటికీ నాకు భయం కలుగలేదు. ధ్యానధార, అహం స్ఫురణ పోలేదు. ఈ శరీర స్థితికి విచారమూ కలుగలేదు. ఇలా 10,

15 నిమిషాలు గడిచాయి. తటాలున శరీరమాద్యంతమూ శక్తి ప్రసార మయింది. రక్త ప్రసరణ, హృదయచలనం అతి తీవ్రంగా ప్రారంభ మయినాయి. ప్రతి రోమకూపంలోనూ విపరీతంగా చెమట పోసింది.''

ఈ మరణానుభూతి కలుగుతున్న సమయంలో భగవాన్ శ్రీరమణు లకు బాహ్యంగా జరుగుతున్న విషయాలు తెలుస్తూనే ఉన్నవి. తన సహచరుల సంభాషణ విన్పిస్తూనే ఉన్నది. ''నా శరీరం నల్లబడటం, శ్వాస చలనము, రక్త ప్రసరణ ఆగిపోవటం, కాళ్ళూ చేతులు బాగా చల్లబడిపోవటం అన్నింటినీ చూస్తూనే ఉన్నాను. కాని 'అహంస్ఫురణ' మాత్రం కొనసాగుతూనే ఉన్నది. నా దేహ పరిస్థితి గురించిన భయం కాని, విచారము కాని కలుగలేదు'' అన్నారు భగవాన్.

మరణానుభూతితో మొదలైన భగవాన్ జీవితంలో మరల కొన్ని మార్లు మరణానుభవాలు ఏదో స్థాయిలో కలిగాయని మనకు తెలుస్తోంది. వారికి ఆ సమయంలో దేహానికి జరుగుతున్న పరిణామాలను చూసికూడా భీతి కలుగలేదు. అటువంటి విపత్కర పరిస్థితులలో కూడా వారికి 'అహంస్ఫురణ' కొనసాగింది. సర్వవ్యాప్త చైతన్యమే తానన్న అనుభవం అఖండంగా సాగింది. ఇది ఎవరికీ సాధ్యం? జనన మరణాలను తన అధీనంలో ఉంచుకుని, భగవాన్ శ్రీరమణ మహర్షిగా భూమిపై అవతరించిన, మృత్యుంజయుడైన ఈశ్వరునికి తప్ప.

శ్రీరమణార్పణమస్తు

## Real freedom

(From a Speech of Dr. K. Subrahmanian)

We may acquire a lot of knowledge about Sastras or philosophy or spirituality but this may at best earn us admiration from others. Knowledge alone does not give us peace of mind. The man who knows a great deal need not necessarily be a wise man. A man who knows practically nothing, he may be a wise man. It has got nothing to do with the kind of knowledge we are familiar with. Sri Ramakrishna was almost an illiterate, Jesus Christ did not go to any school or college, Bhagavan studied only up to third form.

*Atmavidya* (Self-Knowledge) is something that one gets through the Grace of the Lord. When we have atmavidya, we don't need any other kind of vidya, because all other vidyas are contained in this. But we try to have knowledge of so many things. Eventually we realize that knowledge of so many things does not make us happy. What are japa , puja and dhyana for? They enable you to still the mind. On the other hand, external knowledge of any kind agitates you more and more. You want to compete with other people while acquiring external knowledge. In competition there is always disturbance of some kind or the other. When I want to know something about myself, then I have to go within. What I am, I cannot find in books. But if I am interested in atmajnana, the only thing that is important is to try to understand the person who wants to know or study.

Adi Shankara who knew everything, who had studied and written so much has said, don't get confused by the shastras and don't waste your time. Most important thing is to understand yourself. In Viveka Chudamani he said, "*shabdajaalam mahaaranyam chithabhramana kaaranam*" **शब्दजालं महारण्यं चित्तभ्रमण कारणं ।** This means, "The world of words, the world of shastras, is like a huge forest; if you get into this forest, you will

be terribly confused." Because this purana will say something, that one will say something else and you will be confused as to which path to follow. So Shankara says, you try to find out the truth not by reading but by experience. You may reject many things saying you don't have faith in them. You can even say God does not exist. But you cannot say I do not exist. Nobody says 'I' don't exist. Everybody says, irrespective of caste, creed or religion, I, I, I-aham. Who is this I? What happens to that person when he is in deep sleep? Who says 'I slept well'? When you go to bed and sleep, the mind is not there, you are not conscious of your body or your mind; when you get up, you say I slept well. Who is this I that is constantly there? This line of thinking can occur to you only by the Grace of the Lord. Shankara says in the same Viveka Chudamani:

*Durlabham trayamevaitaddeivaanugraha hetukam*
*Manushyatavam mumukshutvam*
*mahapurushasamshrayah*

**दुर्लभं त्रयमेवैतद्देवानुग्रह हेतुकम् ।**
**मनुष्यत्वं मुमुक्षुत्वं महापुरुषसंश्रयः ॥**

There are three things that are most difficult to obtain in this world. To be born as a human being, the desire for *moksha* (freedom) and association with great people.

For us freedom means not to be controlled or to be bothered by anybody else. We want to do whatever we like to do; we don't want any interference from anyone. We should realize that such freedom in life comes with responsibilities - responsibilities towards family, society or the nation.. One may be the richest industrialist but he will have to follow procedures laid out by the law of the land. His wealth or power does not permit him to enjoy unrestricted freedom that he may want in running his business. You may have the best car in the world but

